క్లుప్తంగా


తడి, పొడి చెత్తపై అవగాహన



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

కాప్రా: తడి, పొడి చెత్త విధానంపై విద్యార్థులకు జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ సిబ్బంది అవగాహన కల్పించారు. బుధవారం కమలానగర్ ప్రభుత్వ స్కూల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమం ద్వారా తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త సేకరణ ఆటోలకు ఇవ్వాలని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇచ్చేందుకు ప్రతి ఇంటికి రెండేసి బుట్టలను అందించామని చెప్పారు. ఇళ్లలోని తల్లిదండ్రులకు కూడా పారిశుద్ధ్యం గురించి వివరించి స్వచ్ఛ హైదరాబాద్‌కు తోడ్పడాలని కోరారు. పారిశుద్ధ్య సిబ్బంది భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విష్ణు సహస్రనామ పారాయణం



మల్కాజిగిరి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆనంద్‌బాగ్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో అఖండ విష్ణు సహస్ర నామపారాయణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. వేంకటేశ్వర వైభవత్సోవంలో భాగంగా సుప్రభాతసేవ, తోమాల సేవ, అర్చన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, రాత్రి పవళింపు సేవ జరుగుతాయని, మధ్యాహ్నం 12.15 గంటలకు ఏకకాలంలో 2511 మంది భక్తులు, వేదపండితులతో 12 పర్యాయాలు విష్ణు సహస్రనామపారాయణం జరుగుతుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

శుభాకాంక్షలు



మల్కాజిగిరి: హనుమాన్‌పేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో సీఐ సత్యనారాయణ, డీఐ శ్రీశైలం, సెక్టార్ ఎస్సై సునీల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కృష్ణారావు, సలహాదారులు స్వామి, సీవీ.నర్సింహరావు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ అమర్‌సింగ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ సుదర్శన చక్రం కాలనీ వాసుల నూతన కేలండర్‌ను కార్పొరేటర్ సుభాష్‌నాయక్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అమర్‌సింగ్ హాజరయ్యారు. కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్‌రెడ్డి, చారి, రామస్వామి కాలనీవాసులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్



అల్వాల్: నేరేడ్‌మెట్ పరిధిలోని మారుతీనగర్‌కు చెందిన పాత నేరస్తుడు జేమ్స్ (24)ను ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, మల్కాజిగిరి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. అతడిని మంచి ప్రవర్తన కోసం బైండోవర్ చేశారు. గతంలో జేమ్స్ 7 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. బైండోవర్ చేస్తూ.. రూ. 2 లక్షల సొంత పూచికత్తుపై బాండ్ తీసుకుని పంపించినట్లు తెలిపారు.

◆ నేరేడ్‌మెట్ రేణుకానగర్‌కు చెందిన ప్రాపర్టీ విషయంలో గొడవ పడుతున్న అన్నదమ్ములైన యాదగిరి, అతడి కుమారుడు వెంకటేష్, బాలరాజులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని పోలీసులు తెలిపారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

మల్కాజిగిరి ఎంపీ , దిశ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తూ బలహీనవర్గాల ప్రజలకు చేయూత నందించడంతో పాటు, జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించడమే కాకుండా సమస్యలపై చర్చించడానికి కాకుండా పరిష్కరించడానికి సమావేశాలు దోహదపడాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు, దిశ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రిరాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద, అరికెపూడి గాంధీ, మెంబరు సెక్రటరీ జిల్లా కలెక్టరు గౌతమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ శాఖల వారీగా కేంద్ర, రాష్ట్ర పథకాల అమలును, పురోగతిపై సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అనే వ్యత్యాసం చూపకుండా ప్రజలకు సత్ఫలితాలు చేకూరేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రశాంత్, పంచాయతీ రాజ్ ఈఈ వేణుగోపాల్, సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత తదితరులు పథకాల పురోగతిపై నివేదికలను ప్రవేశపెట్టారు.



ఎంపీ ఈటల రాజేందర్‌కు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

డీఆర్‌సీ సమావేశాలు మళ్లీ నిర్వహించాలి

రాష్ట్రంలో అభివృద్ధి ,సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు కేటాయిస్తే ,రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఇస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో (దిశ) సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రైల్వేల అభివృద్ధికి కేటాయించిన నిధులు కంటే రెట్టింపులో ఈ పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలకు సంబంధించి గతంలో రైల్వే పనులకు మాత్రమే కేంద్రం నిధులు విడుదల య్యేవని, మోదీ ప్రభుత్వం హయాంలో 100 శాతం నిధులు అందజేస్తుందన్నారు. చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను కేంద్ర ప్రభుత్వం రూ.410 కోట్లతో అద్భుతంగా నిర్మించిందన్నారు. తెలంగాణలో 45 రైల్వే స్టేషన్లను అత్యాధునికంగా అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగానే రూ.2 వేల కోట్లతో సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పీఎం విశ్వకర్మ పథకం కింద వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశ సంపద గణనీయంగా పెరిగిందన్నారు. రూ.4 లక్షల కోట్లతో యువతకు ఉపాధి కల్పన ,ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. దిశ సమావేశాలతో ప్రజా సమస్యలు చర్చకు రావటంతోపాటు పరిష్కారమవుతాయన్నారు. అందుకే మళ్లీ డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ నేతలు పటోళ్ల విక్రంరెడ్డి .చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'దిశ'లో ఎవరు ఎమన్నారంటే..



'దిశ' సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు

సాక్షి,సిటీబ్యూరో: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ)సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, కమిటీ సభ్యులు తమ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దిశ చైర్మన్ ,ఎంపీ ఈటల రాజేందర్, మెంబర్ సెక్రటరీ ,కలెక్టర్ గౌతమ్ దృష్టికి తీసుకెళ్లారు . వారు ప్రస్తావించిన విషయాలు వారి మాటల్లోనే.

దోమల బెడదను నివారించాలి

మల్కాజిగిరిలో డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. మచ్చ బొల్లారం డంపింగ్ యార్డును చక్కదిద్దాలి. దోమల బెడదనుంచి మల్కాజిగిరిని కాపాడాలి. డిగ్రీ కాలేజీ నిర్మాణానికి రూసా నిధులు సిద్ధంగా ఉన్నా.. స్థలం లేక ఇబ్బంది పడుతున్నాం. 'దిశ'లో 2 ఎకరాలు కేటాయిస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించటం ఆనందంగా ఉంది. నియోజకవర్గానికి కేంద్ర ప్రభుత్వ నిధులు కేటాయించాలి. మౌలాలి పారిశ్రామికవాడ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలి.అల్వాల్ పీహెచ్‌సీని ప్రారంభించాలి.

- మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

చీర్యాల తుర్కపల్లి, కీసరల్లోని డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలి. వీధి వ్యాపారులకు బ్యాంకులు రుణాలు ఇచ్చి ఆదుకోవాలి.

- సీహెచ్ .మల్లారెడ్డి మేడ్చల్ ఎమ్మెల్యే

వైద్యుల నియామకం చేపట్టాలి

ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులు భర్తీ చేయాలి. టీచర్ పోస్టులను భర్తీ చేసి, ప్రభుత్వ స్కూళ్లకు భవనాలు నిర్మించాలి. డిగ్రీ కాలేజీకి స్థలం కేటాయించి ,భవనం నిర్మించాలి. మన బడి కింద ప్రభుత్వ బడుల్లో చేపట్టిన పనులకు బిల్లులు అందజేయాలి.

- బండారి లక్ష్మారెడ్డి ,ఉప్పల్ ఎమ్మెల్యే

ఆసుపత్రికి స్థలం కేటాయించాలి

ఆసుపత్రి ,గ్రంథాలయం, విద్యాసంస్థలకు సర్వేనంబర్ 330లోని ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలి. ప్రభుత్వ భూములను కాపాడాలి.3 నెలలకు ఒకసారి ఖచ్చితంగా దిశ సమావేశం నిర్వహిస్తే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయి.

- ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ , శేరిలింగంపల్లి ఎమ్మెల్యే

◆ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద తమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరటంతోపాటు ఆసుపత్రులు, ప్రభుత్వ బడుల అభివృద్ధిపై శ్రద్ధ చూపాలని కోరారు, సభ్యుడు విక్రంరెడ్డి కండ్లకోయ రైల్వే బ్రిడ్జి సమస్యను పరిష్కారించాలన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్ ప్రణీత స్థానిక ప్రభుత్వ పాఠశాలకు స్థలం కేటాయిస్తే... భవన నిర్మాణం చేపట్టేందుకు దాతలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

మల్లాపూర్: నాచారం హెచ్‌ఎంటీనగర్ కాలనీలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్లు వేయాలని బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి నాచారం హెచ్‌ఎంటీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోటేశ్వర్‌రావు, కిరణ్, సతీష్, రాజిరెడ్డి, నర్సింగరావు, ఆంజనేయులు, బాల్‌రెడ్డి, రామరాజు, నిర్మలరెడ్డి ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మేడిపల్లి: నీల్‌గోటి ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్, సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి డివిజన్ ఏసీపీ చక్రపాణి హాజరయ్యారు. ఏసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు తమను నమ్ముకున్న తల్లిదండ్రులు, కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చెడు అలవాట్లను దూరంగా ఉండాలన్నారు.

దిష్టిబొమ్మ దహనం



కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నేతలు

అల్వాల్: బీజేవైఎం అల్వాల్ సర్కిల్ నాయకుడు రాచురి అనిల్ ఆధ్వర్యంలో బుధవారం అల్వాల్‌లో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల ఎన్‌ఎస్‌యూఐ నేతలు బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజకీయ క్షేత్రంలో విమర్శలు ప్రతి విమర్శలు సహజమైనప్పటికీ ఇలాంటి భౌతికమైన దాడులు పిరికిపందల చర్యగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్న బీజేపీ కార్యకర్తలు చూస్తూ.. ఊరుకోరని హెచ్చరించారు. నాయకులు శేఖర్, సంతోష్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, కార్తీక్‌గౌడ్, ఆంథోని, రవికిరణ్, సుజాత, తూప్రాన్ లక్ష్మణ్, అరవింద్‌రెడ్డి, సర్వేశ్వరరావు, రవి, రాకేష్ తదితరులున్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్‌రావు

మౌలాలి : మౌలాలి డివిజన్‌లోని సాయినాథపురంలో రామకృష్ణ విద్యానికేతన్ పాఠశాలలో నేరేడ్‌మెట్ పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బుధవారం ఎస్సై శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ కాంతయ్యల ఆధ్వర్యంలో విద్యార్థులకు వివరిస్తూ.. అప్రమత్తంగా ఉంటే నేరాలను అరికట్టవచ్చని సూచించారు. ఓటీపీ జాబ్ ఫ్రాడ్, కొరియర్, వీడియో కాల్స్ తదితర వాటిని నిర్లక్ష్యం చేయాలని విలువైన సమాచారాన్ని అపరిచిత వ్యక్తులకు ఇవ్వకూడదన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బులు పోగొట్టుకుంటే నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

చర్లపల్లి టెర్మినల్‌కు ప్రత్యేక బస్సులు

బోడుప్పల్: సికింద్రాబాద్ నుంచి చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు 10 నిమిషాలకు ఓ బస్సును నడుపుతున్నట్లు చెంగిచర్ల డిపో మేనేజర్ కవిత తెలిపారు. చెంగిచర్ల డిపోలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. రూట్‌నంబర్ 250 సికింద్రాబాద్ బ్లూసీ పాయింట్ నుంచి ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు వయా హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, హెచ్‌పీసీఎల్ మీదుగా చర్లపల్లి టెర్మినల్‌కు బస్సు సౌకర్యం ఉందన్నారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుంచి చెంగిచర్ల, ఉప్పల్, రామంతాపూర్ మీదుగా బోరబండకు 40 నిమిషాలకు ఓ బస్సును నడుపుతున్నామన్నారు. సంక్రాంతి సందర్భంగా ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో ఉప్పల్ ప్లాట్‌పామ్ 9 నుంచి అదనపు బస్సులు నడుపుతున్నట్లు ప్రకటించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చర్లపల్లి నుంచి సంక్రాంతి స్పెషల్ రైళ్లు

కుషాయిగూడ: పూర్తి హంగులతో అందుబాటులోకి వచ్చిన చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి సంక్రాంతి స్పెషల్ ట్రైన్స్ ప్రారంభమయ్యాయి. అత్యాధునిక సదుపాయాలతో నిర్మితమైన ఈ రైల్వేస్టేషన్ నుంచి వివిధ రాష్ట్రాలకు ప్రత్యేకరైళ్లను నడుపుతున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈనెల 18 వరకు ఈ స్పెషల్ ట్రైన్స్ అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. తిరుపతి, నర్సాపూర్, కాకినాడ, శ్రీకాకుళం రైళ్లతో పాటు చర్లపల్లి స్టేషన్ మీదుగా వికారాబాద్‌-కాకినాడ, కాచిగూడ-తిరుపతి, సికింద్రాబాద్‌-కాకినాడ, నాందెడ్‌-కాకినాడ, కాచిగూడ-శ్రీకాకుళం రైళ్లు నడవనున్నాయి. మొత్తం మీదుగా చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి 52 స్పెషల్ సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి.

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



పర్యటనలో జెడ్సీ హేమంత్, కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: నగరాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉప్పల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జోనల్ కమిషనర్, కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి, డీసీ ఆంజనేయులు స్థానికులతో కలిసి పర్యటించారు. సమస్యలు ఉన్న చోట్ల పర్యటించి అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని జెడ్సీ హేమంత్ కేశవ్‌పాటిల్ ప్రకటించినట్లు పరమేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ పరిధిలోని 6వ డివిజన్‌లో గుట్టపై రోడ్డు పనులను మేయర్ అమర్‌సింగ్ బుధవారం పరిశీలించారు. గత కొన్నేళ్లుగా రోడ్డు సరిగ్గా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డివిజన్ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడానికి రోడ్ల నిర్మాణం చేపట్టామని మేయర్ పేర్కొన్నారు. అనంతరం నర్సింహారెడ్డి కాలనీలో మేయర్ పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



పనులను పరిశీలిస్తున్న మేయర్ అమర్‌సింగ్

రూ. 15 లక్షలతో ఓపెన్ జిమ్



జిమ్ ప్రారంభోత్సవంలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: దశల వారీగా పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 21 డివిజన్‌లో బుధవారం రూ.15 లక్షలతో ఓపెన్‌జిమ్, పిల్లల ఎక్విప్‌మెంట్ పనుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..ఆరోగ్యవంతమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు. ఈ జిమ్‌ను ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండేటట్లు చూస్తామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, 21వ డివిజన్ కార్పొరేటర్ సుమన్‌నాయక్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌లో నెలకొన్న పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించేలా కృషి చేయాలని సంబంధిత అధికారులకు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. బుధవారం కాలనీల్లో పెండింగ్ సమస్యలపై సంబంధిత అధికారులు, సిబ్బందితో ఆమె రివ్యూ నిర్వహించారు. ఆమె దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు వివరించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ ఏఈ స్వరూప, కాంగ్రెస్ నేతలు సీతారాంరెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులున్నారు.

స్వచ్ఛ ఆటోలకు అన్‌లోడ్ సమస్య !



డంపింగ్ యార్డులోని ఆటోలు

కుషాయిగూడ: ఇంటింటికి చెత్త సేకరించి డంపింగ్ యార్డు వద్దకు వెళ్లినప్పుడు అన్‌లోడ్ సమస్య ఏర్పడుతుందని ఆటో నిర్వాహకులు వాపోతున్నారు. ఒక్కో ఆటో అన్‌లోడ్ చేసేందుకు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందన్నారు. రామ్‌కీ సంస్థకు సంబంధించిన వాహనాలు మరమ్మతుల కారణంగా ఆటోల అన్‌లోడ్‌కు సమస్య తలెత్తుతుందన్నారు. దీనిపై కాప్రా సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆటో నిర్వాహకులు వాపోయారు.

కనుల పండువగా దీపోత్సవం

రామంతాపూర్ : రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో తిరుప్పావై ధనుర్మాసం 24వ రోజు బుధవారం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కనులపండువగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి విజయభారతి, కోట్ల నరసింహారెడ్డి, ప్రధానార్చకులు తిరుపతి ఆచార్య, శేషాచార్య, సీతారామాచార్యతో పాటు శంకర్ పాల్గొన్నారు.

హైడ్రా కమిషనర్ పర్యటన



చెంగిచర్ల పర్యటనలో హైడ్రా కమిషనర్ రంగనాథ్

బోడుప్పల్: చెంగిచర్ల చింతల చెరువు వద్ద చేపట్టిన బహుళ అంతస్తుల భవనాన్ని బుధవారం సాయంత్రం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతల ఫిర్యాదు మేరకు ఆయన పర్యటించి, మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్‌లతో కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్పందించిన హైడ్రా కమిషనర్ త్వరలో ఫిర్యాదులపై సంయుక్త విచారణ జరిపి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ నేతలు కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్ర శివశంకర్, నేతలు కొత్త విక్రమ్‌గౌడ్, మేకల యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కబ్జా స్థలాల పరిశీలన..

మేడిపల్లి: కమలానగర్‌లోని సర్వేనంబరు 40లో ఉన్న శ్రీమాతాజీ నిర్మలాదేవి సహజయోగ కేంద్రం భవనం పక్కన రోడ్డు స్థలంలో మండపం, ప్రహరీ నిర్మించారంటూ పలుమార్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన హైడ్రా కమిషనర్ పరిశీలించి స్థానికుల నుంచి సమాచారం సేకరించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి రోడ్డు, పార్కు స్థలాన్ని పరిశీలించారు. లే అవుట్‌ను పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విచారణ చేపట్టిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

రూ.38 చొప్పున విక్రయిస్తున్న వైనం

అల్వాల్: 50 క్వింటళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మల రామారం ప్రాంతానికి చెందిన ఇస్లావత్ రాజు (40) హరి (32) మరో నిందితుడు ముఠాగా ఏర్పడి రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నారు. హస్మంత్‌పేట్, అల్వాల్, బోయిన్‌పల్లి తదితర ప్రాంతాల లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి ఇతర ప్రాంతాలకు రూ. 38కి కిలో చొప్పున విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి రూ.1,90,000 విలువ చేసే 50 క్వింటళ్ల రేషన్ బియ్యం బ్యాగులతో 4 ఆటోలు సెయింట్ మైఖేల్ స్కూల్ వే బ్రిడ్జ్ వద్ద నిలిపి ఉంచారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందడంతో వారు వచ్చి ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులు పట్టుబడగా మరొకరు ఆటో వదిలి పరారయ్యారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

అల్వాల్: పాకెట్ల రూపంలో గంజాయిని రవాణా చేసేందుకు యత్నిస్తున్న ఇద్దరు నిందితులను అల్వాల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాల ప్రకారం.. మల్కాజిగిరికి చెందిన భాస్కర్ రెడ్డి (26) ఫిరోజ్ (27)లు గత కొంత కాలంగా నాగపూర్ నుంచి గంజాయిని దిగుమతి చేసుకుని స్థానిక యువకులకు విక్రయిస్తున్నారు. ఈ మేరకు 430 గ్రాముల గంజాయి ప్యాకెట్లను బొల్లారం రైల్వే స్టేషన్ నుంచి రవాణా చేసేందుకు ప్రయత్నిస్తుండగా అల్వాల్ పోలీసులు నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 10 గ్రాముల ప్యాకెట్లను రూ. 300కు కొనుగోలు చేసి రూ.500కు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

అల్వాల్: గుజరాత్ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులకు గేట్ త్రీ, ఫోర్ ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరణ చేయాలని సీఐటీయూ నేతలు పేర్కొన్నారు. బుధవారం వినాయక్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి శోభారాణి, జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్‌లు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల దరఖాస్తులను ఫిబ్రవరి 13వ తేదీ ఢిల్లీలో రాష్ట్రపతికి అందజేయనున్నట్లు వివరించారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు రాణి, శ్రీదేవితో పాటు టీచర్లు పాల్గొన్నారు.